క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, మైత్రీవనం, కుందన్ బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శీష్‌మహల్, జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్, దివ్యశక్తి లేన్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, స్పెన్సర్ బిల్డింగ్, ఎస్‌బీఐ స్టాఫ్ కాలేజ్, మెయిన్‌రోడ్డు, అమృత విల్లా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.75, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 90, బజ్జీమిర్చి 90, క్యాప్సికమ్ 85, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 45, దొండ 18, గుండుబీన్స్ 100, గింజ చిక్కుడు 65, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 25, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అజార్

బౌద్ధనగర్: భవన నిర్మాణ కార్మికుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ జహంగీర్ 3వ వర్ధంతి సందర్భంగా వారాసీగూడ చౌరస్తాలో భవన నిర్మాణ కార్మికులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జహంగీర్ తనయుడు మహమ్మద్ అజార్ ప్రతి సంవత్సరం తన తండ్రి వర్ధంతి రోజు అన్నదాన కార్యక్రమం, పేద భవన నిర్మాణ కార్మికులకు తన వంతు సహాయం చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న మురళీధర్‌రావు

రసూల్‌పురా: బీజేపీ సీనియర్ నాయకులు, మురళీధర్ రావు జన్మదిన వేడుకలు కంటోన్మెంట్ నియోజకవర్గం మారేడుపల్లి లోని డెఫ్, అండ్ డెమ్ ఓరల్ స్కూల్‌లో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మురళీధర్ రావు కేక్ కట్ చేసి విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుష్మిత శంకర్రావు, పరశురాం, విజయరామరాజు పాల్గొన్నారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యం



ఉమారాణి

బౌద్ధనగర్: మూడేళ్ల చిన్నారిని తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన వారాసిగూడా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పార్శిగుట్టలోని న్యూఅశోక్‌నగర్‌కు చెందిన ఉమ రాణి (29) శేఖర్ దంపతులు. ఊరిలో భూ తగాదాల నేపథ్యంలో గత వారం శేఖర్ తన స్వగ్రామమైన వట్టిపల్లికు వెళ్లాడు. ఉమారాణి తన కుమారుడు రియన్స్‌తో కలిసి ఇక్కడే ఉంటుంది. ఈ నెల 15న రియన్స్(03)ను తీసుకొని బయటకు వెళ్లిన ఉమారాణి రాత్రైనా ఇంటికి రాలేదు. తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన ఇంటి యజమాని భర్త శేఖర్‌కు విషయం తెలిపాడు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బందోబస్తులో సెంట్రల్ పీస్ కమిటీ

కాచిగూడ: శాంతి భద్రతల పరిరక్షణలో సెంట్రల్ పీస్ కమిటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అడిషనల్ పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) విక్రమ్‌సింగ్ అన్నారు. బోనాల వేడుకల సందర్భంగా పాతబస్తీలోని అక్కన్న, మాదన్న మహంకాళి దేవాలయం వద్ద సెంట్రల్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు పోలీసులతో కలిసి బందోబస్తులో పాల్గొని స్వచ్ఛంద సేవలు అందించారు. కాచిగూడ డివిజన్ బర్కత్‌పుర నుంచి సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.శరత్ శ్యామ్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ ప్రతినిధులు పోలీసులకు సహకరించారు. ఈ సందర్భంగా వారిని అడిషనల్ కమిషనర్ అభినందించారు. కిషన్‌శర్మ, శశికాంత్ అగర్వాల్, ఖాజా అబ్దుల్ మోయిజ్, ఎస్.నారాయణరెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ మజారుద్దీన్ పాల్గొన్నారు.

నిత్యం తలెత్తుతున్న ట్రాఫిక్‌జాం



మోండా మార్కెట్‌లో ట్రాఫికర్

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యతో వాహనచోదకులు.. ప్రజలు సతమతమవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు.. వేలాది జన సంచారం ఉన్న ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ కొరవడింది. ట్రాఫిక్ పోలీసు అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యంతో వాహనచోదకులు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది కూరగాయలు, నిత్యావసర సరకులు ఇతరత్రా కొనుగోళ్ల కోసం ఇక్కడి వస్తుంటారు. పెరుగుతున్న వాహన రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పండుగల సమయంలో ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీకావు. తూతూ మంత్రంగా అక్కడక్కడ పోలీస్ నిధులతో కాలం నెట్టుకొస్తున్నారే తప్ప సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అద్దెలకు ఫుట్‌పాత్‌లు..

అసలే ఇరుకైన రోడ్లు దానికి తోడు ఫుట్‌పాత్ ఆక్రమణలు, రోడ్లపై వ్యాపార కార్యకలాపాలు ప్రజలకు సంకటంగా మారాయి. సదరు రోడ్లపై అనేక మంది నాయకులు ఫుట్‌పాత్‌లను కూడా అద్దెలకిచ్చి కాసులు దండుకుంటున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సదరు నాయకులు తమ అధికార బలంతో ట్రాఫిక్ పోలీసులను మచ్చిక చేసుకొని ఎంతో కొంత మామూళ్లు ఇస్తూ మనుగడ సాగిస్తున్నారనేది బహిరంగానే వినిపిస్తున్నాయి. పాదచారులు ఫుట్‌పాత్‌లపై నుంచి రాకపోకలు సాగించడం ఇక్కడ కష్టంగా మారింది. దీంతో ప్రజలు రోడ్లపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు.

ట్రాఫిక్ జామ్ ప్రాంతాలివే..

మోండా మార్కెట్‌కు రెండు వైపులా ఉన్న రోడ్లపై నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. బాటా ఎదురుగా స్వీట్ షాపు నుంచి ఓల్డ్‌జైల్, మోండా మార్కెట్, సజ్జన్‌లాల్‌స్ట్రీట్, మారుతీ వీధి, పాలికా బజార్ చౌరస్తా, ఆల్ఫా హోటల్, మోండా మార్కెట్ చౌరస్తా నుంచి ఇస్లామియా స్కూల్, గాస్ మండి, సాంబమూర్తి నగర్ బస్తీ, బోయిగూడ రైల్వే బ్రిడ్జి ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం భారీగా ట్రాఫిక్ జాం అవుతోంది. డిప్యూటీ స్పీకర్ ఇంటి నుంచి మోండా మార్కెట్ చౌరస్తా, బోయిగూడ రైల్వే బ్రిడ్జి నుంచి సీతాఫల్ మండిలోని తన కార్యాలయానికి వెళ్తుంటారు. అయితే అనేక సందర్భాల్లో డిప్యూటీ స్పీకర్ పద్మారావు ట్రాఫిక్ ఇరుక్కున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. కొన్ని సమయాల్లో ఆయన భద్రత సిబ్బంది కారు దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పండుగ వేళల్లో అయితే మోండా మార్కెట్ వెళ్లడానికి అనేక మంది జంకుతున్నారు. ఎక్కడ ట్రాఫిక్‌లో ఇరుక్కొని ఎంత సమయం వరకు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుందని పలువురు అంటున్నారు. మోండా మార్కెట్ వెనుక గేటు ముందు రోడ్డులో పండుగ సమయాల్లో ప్రజలు ట్రాఫిక్‌తో నరకయాతన పడుతున్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగిస్తాం

మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటాం. త్వరలో సదరు రోడ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించడంతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు తీసుకుంటాం. మోండా మార్కెట్ రోడ్లపై ప్రజలు సులువుగా రాకపోకలు సాగించే విధంగా చర్యలు చేపడుతాం. రోడ్లపై ట్రాఫిక్‌కు అటంకం కలిగిస్తూ వాహనచోదకులకు ఇబ్బంది కలిగించే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదు. –నర్సింహులు, మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

రోడ్లపైనే వ్యాపారాలు..

మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని రోడ్లపైనే వ్యాపార కార్యకలాపాలు ట్రాఫిక్‌కు గుదిబండగా మారాయి. ముఖ్యంగా తోపుడు బండ్ల నిర్వాహకులు రోడ్లపైనే తమ కార్యకలాపాలు సాగిస్తు న్నారు. దీంతో వాహనచోదకులు, పాదచారులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీకావు. ఎవరైనా అడిగితే సదరు తోపుడు బండ్ల నిర్వాహకులు వారిపై దాడులకు సైతం దిగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. షోలాపూర్ స్వీట్ హౌస్ సమీపంలో పండ్ల వ్యాపారులు రోడ్లపైనే తమ కార్యకలాపాలు సాగిస్తుండటంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. తోపుడుబండ్లు, చిరు వ్యాపారుల కార్యకలాపాల కారణంగా మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తీవ్ర రూపం దాల్చుతున్నాయనేది వాస్తవం. మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో అనేక మంది తోపుడుబండ్లు, చిరు వ్యాపారులు స్థానిక నాయకులు, పోలీసులకు మామూళ్లు ఇస్తూ తమ కార్యకలాపాలు సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం వేలాది మంది వాహనచోదకులు, రాకపోకలు సాగించే ప్రజలు.. నిత్యం వ్యాపార కార్యకలాపాల తో రద్దీగా ఉంటే ఈ ప్రాంతంలో ఎప్పుడు కూడా ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు కన్పించరు. రోడ్లపై యథేచ్ఛగా వ్యాపారాలు చేస్తున్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తు న్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

కెనడా 'మార్కం' మేయర్‌ను కలిసిన జేఎస్‌టీ శాయి



సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సేవలపై ముద్రించిన బ్రోచర్‌ను స్కర్ఫిట్టికి వివరిస్తున్న జేఎస్‌టీ శాయి

సనత్‌నగర్: కెనడా దేశం గ్రేటర్ టొరంటోలోని మార్కం నగర మేయర్ ఫ్రాంక్ స్కర్ఫిట్టిని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి కలిశారు. కెనడా పర్యటనకు వెళ్లిన ఆయన ఇక్కడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యకలాపాల గురించి ఆయనకు వివరించారు. సీనియర్ సిటిజన్స్ సామాజిక సేవా కార్యక్రమాలతో కూడిన బ్రోచర్‌ను ఫ్రాంక్ స్కర్ఫిట్టికి చూపించి వివరించారు. అలాగే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నగర రహదారులు, పార్కులు, శ్మశానవాటికల అభివృద్ధి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేస్తున్న అభివృద్ధి పనుల గురించి అక్కడి మేయర్‌కు వివరించినట్లు జేఎస్‌టీ శాయి తెలిపారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్‌కు అందిస్తున్న సేవలు, ప్రభుత్వం తరఫున అందుతున్న రాయితీల గురించి ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నట్లు శాయి పేర్కొన్నారు.

బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రి చేయాలి



మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలో 2023లో అధికారంలోకి వచ్చే ఏ పార్టీ అయినా బీసీని ముఖ్యమంత్రి చేయాలని సదరన్ పొలిటికల్ అకాడమీ అధ్యక్షులు ప్రొ. గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ ఇప్పటి వరకు బీసీ వర్గానికి చెందిన వారు సీఎం కాకపోవడం అగ్రవర్ణాల ఆధిపత్యానికి నిదర్శనం అన్నారు. బీసీ డిక్లరేషన్, బీసీలకు అధిక సీట్లు అంశాలను పక్కకు పెట్టి త్వరలో జరుగనున్న ఎన్నికల్లో 52 శాతం జనాభా కల్గిన బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసే దిశగా అన్ని రాజకీయ పార్టీలు ఆలోచించాలన్నారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ రూపకల్పన, భూమి పంపకం, రాజ్యాధికార పంపిణీ జరగాలన్నారు.

పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లించాలి



సీఎంకు రాసిన లేఖను చూపుతున్న లింగం గౌడ్

లాలాపేట: ఇంజినీరింగ్, ఉన్నత విద్య చదివే బీసీ, ఓసీ విద్యార్థులందరికీ ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. ఇంజినీరింగ్, ఉన్నత విద్యా ఫీజులు భారీగా పెరిగిన నేపథ్యంలో విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. తెలంగాణలో బీటెక్ కనీస ఫీజు రూ. 45 వేల నుంచి గరిష్టంగా రూ 1.60 లక్షల వరకు ఉందని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది కేవలం రూ. 35 వేలు మాత్రమే అన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు మాత్రం పూర్తి ఫీజును చెల్లిస్తూ బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని లేఖలో పేర్కొన్నారు.

మండలానికో న్యాయస్థానం ఏర్పాటు చేయాలి

లిబర్టీ: సమాజంలోని వర్గాలకు న్యాయం అందాలని హైకోర్టు సీనియర్ అడ్వకేట్ సిరివెరి శ్రీశైలం అన్నారు. అందరికీ న్యాయం పొందాలంటే ప్రతి మండలంలో ఒక న్యాయస్థానం ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోప్సు సంస్థలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కింద వర్గాలకు పూర్తిస్థాయిలో న్యాయం అందడం లేదని అన్నారు. హైకోర్టు సుప్రీంకోర్టు పరిధిలో లక్షల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలంటే క్షేత్రస్థాయిలో కిందికోర్టులను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు. సుప్రీంకోర్టులో ఖాళీగా ఉన్న జడ్జీల పోస్టులను హైకోర్టులో ఖాళీగా ఉన్న పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కోరారు. న్యాయం కోసం న్యాయస్వామ్యం రాజ్యాంగం విలువలు పడడం అన్నారు.

గోమాత రక్షణకు పాటు పడాలి



గోమాతకు పూజ చేస్తున్న నాయకులు

లాలాపేట: అమావాస్య సందర్భంగా సోమవారం ఆర్‌ఎస్‌ఎస్ లాలాపేట శాఖ ఆధ్వర్యంలో లాలాపేటలో గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు డాక్టర్ కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హిందూ ధర్మంలో గోమాతను తల్లిగా పూజిస్తామన్నారు. గోమాతను పూజిస్తే ఆరోగ్యంతో పాటు ధన వృద్ధి కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు గోవుకు హారతిస్తూ హనుమాన్ చాలీసా పఠించారు. ఈ కార్యక్రమంలో గోపాల్, రఘు, వినయ్, శ్రీనివాస్, మనీష్, శ్రీరామ్, నేతి రాములు గుప్తా పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రలకు కనీస వేతనం అమలు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు రూ.28 వేల కనీస వేతనం అమలు చేయాలని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరియాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గత 16 ఏళ్లుగా ఆరోగ్యశ్రీ పథకంలో ఆరోగ్యమిత్రలుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీలు పూర్తి చేసి క్వాలీఫైడ్ వ్యక్తులుగా ఉన్న తమను నైపుణ్యంలోని ఉద్యోగులుగా గుర్తించడం అత్యంత బాధాకరమన్నారు. రూ.15,600 వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదురౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్రప్రభుత్వం కనీస వేతనంతో పాటు రూ.5 వేల టీఏ,డీఏ చెల్లించాలన్నారు. షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేసి చనిపోయిన మిత్రల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

దేశం అనుసరించేలా సంక్షేమ పథకాలు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



చెక్కులు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: యావత్ దేశం అనుసరించే విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన 33 మందికి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను సోమవారం ఆయన వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదింటి ఆడపడుచుల పెళ్లికి ఆర్థికంగా సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్సే అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు ఖలీల్‌బేగ్, సరాఫ్ సంతోష్, ఫాజిల్, కరీంలాలా పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో ప్రజాప్రతినిధులు



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



పూజలో పాల్గొన్న పద్మారావుగౌడ్, కార్తీకరెడ్డి

లాలాపేట: ఆషాఢమాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం లాలాపేటలోని భగవతీ పోచమ్మ దేవాలయంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, మాజీ మేయర్ బండా కార్తీకచంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేసి వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బండా చంద్రారెడ్డి, త్రీనేత్రగౌడ్, బండి మహేశ్, నిర్మల బాలకృష్ణ పాల్గొన్నారు.

- బీఆర్‌ఎస్ నాయకులు శివశంకర్ ఆధ్వర్యంలో లాలాపేట ఇందిరానగర్‌లో నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమంలో పద్మారావుగౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, సునీల్ ముదిరాజ్ పాల్గొన్నారు.

దండు మారెమ్మకు..

సనత్‌నగర్: బోనాల ఉత్సవాల్లో భాగంగా బేగంపేట భగవంతాపూర్‌లోని దండు మారెమ్మ అమ్మవారికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చేసిన పుష్పాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు రవీందర్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించి తీర్థ, ప్రసాదాలను అందించారు.

విస్తారంగా వానలు కురిపిస్తా

చిలకలగూడ రంగంలో భవిష్యవాణి



భవిష్యవాణి వినిపిస్తున్న దృశ్యం

చిలకలగూడ : ప్రజలు, రైతుల ఆనందం కోసం విస్తారంగా వర్షాలు కురిపిస్తానని భవిష్యవాణిలో వినిపించారు. చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ ఆలయ బోనాల జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి నిర్వహించిన రంగం కార్యక్రమంలో లాల్‌దర్వాజాకు చెందిన భవిష్యవాణి ప్రజావతి పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ పద్మారావుతో పాటు భక్తులకు అడిగిన ప్రశ్నలకు భవిష్యవాణి సమాధానాలు చెప్పింది. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చేస్తానని, ఈసారి జాతర ఏర్పాట్లు బాగున్నాయని, చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. ఈ ఏడాదే ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ సునీల్‌దత్, ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐ మట్టంరాజు, శిక్షణ కోసం మారిషస్ నుంచి వచ్చిన ఐపీఎస్ అధికారిణి శాలోన్, కార్పొరేటర్ సామల హేమ, ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు పాల్గొన్నారు.

అంగ 'రంగం' వైభవం

చిలకలగూడ బోనాలు జాతరకు పోటెత్తిన జనం



రంగం కార్యక్రమానికి పచ్చికుండను తెస్తున్న కానుగుల వంశీయులు

చిలకలగూడ : డప్పు చప్పుళ్లు, యువకుల నృత్యాలు, పోతరాజుల వీరంగాలు, శివసత్తుల పూనకాలు, మహిళల కోలాటాలు, తొట్టెలు, ఫలహారం బండ్ల ఊరేగింపు, భవిష్యవాణి వినిపించే రంగం వంటి కార్యక్రమాలతో చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతరలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మా బైలెల్లినాదో పాటలతో అమ్మవారి ఊరేగింపు, సాగనంపు యాత్రలో పాల్గొన్న ప్రజలు భక్తి పారవశ్యంతో చిందేశారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకైన బోనాల జాతరకు లక్షలాదిమంది హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వంశీయులు కానుగుల ఆంజనేయులు, పాపయ్య సమర్పించిన పచ్చికుండపై నిలబడి నిర్వహించిన రంగం కార్యక్రమానికి వేలాదిమంది భక్తుల హాజరై భవిష్యవాణి కార్యక్రమాన్ని వీక్షించారు.

తొట్టెలు, ఫలహారంబండ్ల ఊరేగింపు

బోనాల జాతరలో ఫలహారం బండ్ల ఊరేగింపులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం రాత్రి ప్రారంభమైన తొట్టెలు, ఫలహారం బండ్ల ఊరేగింపు అర్ధరాత్రి వరకు కొనసాగింది. విద్యుత్‌కాంతులు, విచిత్ర వేషధారణలు, పోతరాజుల వీరంగాలు, యువతీయువకుల ఆటపాటలతో పలు ప్రాంతాల నుంచి ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికలపై నిర్వహించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డిప్యూటీ స్పీకర్ పద్మారావు, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, మాజీ మేయర్ బండా కార్తీకచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి మేకల సారంగపాణి, ప్రముఖ పారిశ్రామికవేత్త నాగులూరి సాయిబాబా, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నోముల ప్రకాశరావు ఫలహారం బండ్లను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్ నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు చేపట్టారు.



ఫలహారం బండి ఊరేగింపులో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

రసూల్‌పురాలో ..

రసూల్‌పురా: ఆషాఢమాస బోనాల జాతరలో భాగంగా సోమవారం తాడ్‌బండ్, తవాయిపురా, రసూల్‌పురా, మడ్‌ఫోర్ట్ టెంపుల్ గ్రౌండ్ ప్రాంతాల్లోని వివిధ ఆలయాల్లో రంగం, బలిగంప, ఫలహార బండ్ల ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఆయా ఆలయాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్‌నాయక్, బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీగణేష్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జైప్రకాష్, ముప్పిడి మధుకర్, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, రాజుసింగ్, వ్యాపారవేత్త ఎస్‌వి. పృథ్వీనాథ్ వేర్వేరుగా హాజరై పూజలు చేశారు.



తాడ్‌బండ్‌లోని ఊరేగింపులో పాల్గొన్న శ్రీగణేష్



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మర్రి రాజశేఖర్ రెడ్డి